ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 16 జూలై 2024







నస్పూర్‌లో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగు నీరు

వర్షాకాలం.. వ్యాధులతో సమరం

- వాతావరణంలో మార్పులతో ఇబ్బందులు..
- జనవరి నుంచి జూలై వరకు 10వేల జ్వర కేసులు..
- జిల్లాలో ఒక డెంగీ కేసు నమోదు...
- వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తం, సర్వేలు, అవగాహన సమావేశాలు...
- జిల్లాలో హైరిస్క్ గ్రామాల గుర్తింపు...

నస్పూర్, జూలై 15: వర్షాకాలంలో పారిశుధ్య సమస్య తలెత్తడం వలన వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది. జిల్లాలో అడపాదడపా కురుస్తున్న వర్షాల వలన వాతావరణంలో భిన్నమైన మార్పు లు చోటు చేసుకుంటున్నాయి. దీంతో వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉన్నందున వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ముందస్తు చర్యలను చేపట్టి సిబ్బందికి శిక్షణ, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. మంచిర్యాల జిల్లాలో జనవరి నుంచి జూలై 14వతేది వరకు 10,406 జ్వర కేసులు, జనవరి 31 జన్నారం పీహెచ్‌సీ పరిధిలోని కవ్వాల్‌లో యువతీ డెంగీ పాజిటివ్ కేసు నమోదైంది. మంచిర్యాల జిల్లాలో 33 హైరిస్క్ గ్రామాలను వైద్య ఆరోగ్య శాఖ గుర్తించి వాటిపై దృష్టి సారించింది. వాతావరణ మార్పులతో ఉదయం చల్లదనం, మధ్యాహ్నం వేడి, సాయంత్రం వానతో ప్రజలు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సీజన్‌లో డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, వైరల్ జ్వరాలు వ్యాపిస్తాయి. వాతావరణంలో మార్పుల కారణంగా వ్యాధులు మరింత ఇబ్బంది పెట్టే ప్రమాదం పొంచి ఉన్నది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమై సర్వేలు మొదలుపెట్టారు. వ్యాధుల నియంత్రణకు వైద్య సిబ్బంది ఇంటింటా సర్వే పనులు చేపట్టారు.

నివారణ చర్యలే ముఖ్యం...

పారిశుధ్య లోపాన్ని నివారిస్తే వ్యాధుల వ్యాప్తిని నియంత్రించవచ్చు. నీరు నిలిచి ఉన్నచోట దోమలు వృద్ధి ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు.

డెంగీ లక్షణాలు..

దోమ కాటు వలన డెంగీ జ్వరం వ్యాపిస్తుంది. డెంగీ బారిన పడిన వారు తీవ్ర జ్వరం, తలపొప్పి వస్తుంది. కళ్ళు తెరవడం కష్టంగా, శర్మంపై దద్దర్లు, కండరాలు, కీళ్ళ నొప్పులు ఉంటాయి. రక్తపోటు పడిపోవడం, అధిక దాహం వేస్తుంది. డెంగీ నిర్ధారణలో ప్లేట్ లెట్ కౌంట్ తదితర కారణాలను పరీక్షల ద్వారా నిర్ధారిస్తారు. ఎక్కువ శాతం పండ్ల రసాలు తాగించాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.



గ్రామాల్లో, పట్టణాల్లో ఫాగింగ్ చేయడంలేదు. దీంతో జ్వరాల బారిన పడి ప్రైవేట్, ప్రభుత్వాసుల్లో రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థలు అధ్వాన్నంగా మారడం, పూడిక తొలగించడం లేదు. ఫలితంగా జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్ళు నొప్పులతో ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం: జిల్లా వైద్యాధికారి అనిత

వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా చర్యలను చేపట్టాం. సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. మందులు, పరీక్షలకు కావాల్సిన సామగ్రి ఉంది. ర్యాపిడ్ సర్వే మళ్లీ చేస్తున్నాం. వర్షకాలం కావడంతో సీజన్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. డెంగీ నిర్ధారణ పరీక్షలు పీహెచ్‌సీల్లోనే చేసే అవకాశం ఉంది. ఇళ్ల వద్ద నీటి నిల్వను తొలగిస్తూ స్ప్రే చేయిస్తున్నాం. జ్వర పరీక్ష నిర్ధారణకు 11 మంది టెక్నీషన్లు అందు బాటు ఉన్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహిస్తాం. డెంగీ నివారణకు ఈ నెల 1 నుంచి 31 అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.



పారిశుధ్య సమస్యే కారణం..

సీజనల్ వ్యాధులకు పారిశుధ్య సమస్యే కారణమైవుతోంది. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోవడం, డ్రైనేజీలు పూడికతో నిండిపోవడం, మురుగు నీటి గుంతలు అలాగే ఉండిపోవడం వలన దోమలు వృద్ధి చెందుతున్నాయి. పంచాయతీ పాలక వర్గాల సమయం ముగిసిపోవడంతో ప్రత్యేకాధికారుల పాలన మొదలైంది. చాలా చోట్ల గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించా లని ఆందోళన చేపట్టారు. పాలకవర్గాలు లేక పంచాయతీల నిర్వహణ కష్ట తరంగా మారింది. దోమల నివారణకు ఫాగింగ్, మురుగు నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం వంటి పనులు మందకొడిగా సాగుతున్నాయి. అధికార యంత్రాంగం జిల్లాలోని 109 పాఠశాలు, హాస్టళ్లలో దోమల నివారణ మందు స్ప్రేను చేయడం మొదలుపెట్టింది. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు-17, అర్బన్ హెల్త్ సెంటర్లు-4, బస్తీ దవాఖానాలు-3, ఉపకేంద్రాలు-146, నిరంతరం పని చేసే ఆరోగ్య కేంద్రాలు-9 ఉన్నాయి. ఆసు పత్రులు పరిధిలో వైద్య సిబ్బంది గ్రామాల్లో, పట్టణాలో ఇంటింటికి తిరిగి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

వర్షానికి కొట్టుకపోయిన తాత్కాలిక వంతెన

- రాకపోకలకు ఇబ్బందులు



వర్షానికి కొట్టుకపోయిన మామడ తాత్కాలిక వంతెన

వేమనపల్లి, జూలై 15 : మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి నీల్వాయి నుంచి మామడ గ్రామానికి వెళ్ళే రోడ్డు మార్గంలో ఉన్న ఒర్రెపై నిర్మించిన తాత్కాలిక వంతెన కొట్టుకపోయింది. దీంతో మామడ గ్రామస్థులు నీల్వాయి, వేమనపల్లి గ్రామాలకు కాలినడకన రావాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షానికి తాత్కాలిక వంతెనపై పోసిన మట్టి, ఇసుక బస్తాలు పూర్తిగా కొట్టుకపోవడంతో కనీసం ద్విచక్ర వాహనాలు సైతం వెళ్ళలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి నీల్వాయి గ్రామంలో అల్లూరి ధర్మయ్య, చెన్నూరి బాలయ్య, గురుండ్ల నామ్‌దేవ్‌లకు చెందిన పెంకుటిల్లు కూలిపోయాయి. వర్షం పడుతున్నప్పుడు ఆ ఇళ్లల్లో వారు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు.

జిల్లాలో 23.3 మిల్లీమీటర్ల వర్షం

మంచిర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 24 గంటల్లో 23.3 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వేమనపల్లి మండలంలో 138.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చెన్నూరు మండలంలో 70.5 మిల్లీమీటర్లు, కోటపల్లి 69.3, భీమారం 24.1, నెన్నెల మండలంలో 16.4, కన్నెపల్లి 16.2, భీమిని 12.2, జైపూర్ మండలంలో 8.5, బెల్లంపల్లి మండలంలో 8.1, తాండూరు 7.8, లక్సెట్టిపేట 7.5, హాజీపూర్ మండలంలో 6.8, కాసిపేట, దండేపల్లి మండలాల్లో 6.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కన్నుల పండువగా అగ్ని గుండాల మహోత్సవం

జైపూర్, జూలై 15: మండలంలోని వేలాల మల్లన్న స్వామి ఆలయంలో సోమవారం అగ్ని గుండాల మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ మూర్తులకు పూజారులు గోదావరి నదిలో స్నానం నిర్వహించారు. ఒగ్గు, గొల్ల పూజారులు కేతమ్మ భ్రమరాంబిక సమేత మల్లన్న స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులతో అగ్ని గుండాల ప్రవేశం చేశారు. భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ వెంకటేశ్వర్, ఈవో రమేష్, ఎస్సై శ్రీధర్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులతో అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న ఒగ్గు పూజారులు

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

కోటపల్లి, జూలై 15: పారుపల్లి గ్రామానికి చెందిన పడమటింటి శ్రేయాస్ పుట్టిన రోజును పురస్కరించుకొని సోమవారం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్లేట్లు, క్రీడా సామాగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదివి వృద్ధిలోకి రావాలని ఆయన కోరారు. హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, శ్రేయాస్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నస్పూర్, జూలై 15: తెలంగాణ ప్రగతి శీల ఆటో, మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ ఐదవ మహాసభలు ఈ నెల 21న ఇల్లందులో జరుగుతాయని, సభ పోస్టర్లను సోమవారం ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో సీసీసీ కార్నర్ వద్ద ఆవిష్కరించారు. మహసభను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయు) జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మానందం, తెలంగాణ ప్రగతి శీల ఆటో, మోటర్ వర్కర్స్ ఫెడరేషన్ నస్పూర్ మండల అధ్యక్షుడు సదానందం, నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య, మధు, రవి, మహేష్, థామస్ పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపాల్ బదిలీ

జైపూర్, జూలై 15: తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్, డీసీవో బాలభాస్కర్ సోమవారం బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా శామీర్‌పేట గురుకుల కళాశాలకు వెళ్ళారు. బాలభాస్కర్ ఇక్కడ పని చేసిన సమయంలో విద్యార్థులు క్రీడల్లో పతకాలు పొందే విధంగా తీర్చిదిద్దారు. ఇంటర్ ఒకెషనల్ విద్యార్థులు రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచారు. బదిలీపై వెళ్తున్న బాలభాస్కర్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు సన్మానించారు.



ప్రిన్సిపాల్ బాలభాస్కర్

టీజీయూఈఈయూ జిల్లా కమిటీ సమావేశం



ఎస్‌ఈకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

మంచిర్యాల అర్బన్, జూలై 15 : తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రీసిటి ఎంప్లాయిస్ యూనియన్ (టీజీయుఈఈయు) జిల్లా కమిటీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. సమావేశానికి యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నలువాల స్వామి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కార్మికుల పక్షాన యూనియన్ పోరాటం చేస్తుందన్నారు. బిల్ కలెక్టర్లు, మీటర్ రీడర్స్, ఎస్‌పీఎం పనిచేస్తున్న, ఇతర పీసు రేట్ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, కార్మికులకు కన్వర్షన్ ఇవ్వాలని, సబ్‌స్టేషన్‌లో నలుగురు ఆర్టిజన్స్‌ను ఇవ్వాలని, ఆన్‌మ్యాన్డ్ కార్మికులను ఆర్టిజన్స్‌గా గుర్తించి సబ్‌స్టేషన్‌లో ఖాళీలను నింపాలని సీఎండీకి వినతిపత్రాన్ని అందించామన్నారు. విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు చిందం వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర సదానందం, డివిజన్ కార్యదర్శి అంజి, జిల్లా డివిజన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అందుబాటులో గడ్డి విత్తనాలు

కాసిపేట, జూలై 15: పశుగ్రాసం కొరత లేకుండా ఉండేందుకు రైతులు, పశు యజమానులు గడ్డి పెంచుకోవాలని పశు వైద్యాధికారి తిరుపతి సూచించారు. గడ్డి, జొన్న విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని రైతులు విత్తుకుంటే మూడు సార్లు గడ్డి కోసుకోని గ్రాసంగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మంచిర్యాల అర్బన్, జూలై 15: పట్టణంలోని ట్రినిటీ స్కూల్‌లో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో ది హ్యాపీ స్కాలర్ స్కూల్ విద్యార్థి కృషిత్ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థిని పాఠశాల ప్రిన్సిపాల్ విక్రమ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

అధికారుల నిర్లక్ష్యం.. కార్మికులకు శాపం

- అటవీ అనుమతుల్లేక నిలిచిన బొగ్గు తవ్వకాలు
- పనులు నిలిపివేయాలంటూ నోటీసులు జారీ
- ప్రమాదపుటంచుల్లో ఆర్కే-7 గని
- సింగరేణి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణం



ఆర్కే-7 గని ముఖద్వారం

మంచిర్యాల, జూలై 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే-7 బొగ్గు గని విషయంలో అధికారుల నిర్లక్ష్యం కార్మికులకు శాపంగా మారింది. గనిలోని పని స్థలాలు అనుమతులు ఇచ్చిన ప్రాంతాన్ని దాటి ముందుకు వెళ్లడం, కాలపరిమితి ముగియడంతో తక్షణమే బొగ్గు ఉత్పత్తి నిలిపివేయాలని ఇటీవల అటవీశాఖ నోటీసులు జారీ చేసింది. కాలపరిమితి ముగిసి దాదాపు నాలుగేళ్లు గడుస్తున్నా అటవీ అనుమతులు తిరిగి పొందడంలో నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందనే అభిప్రాయాలు వ్యక్తమతున్నాయి. అటవీశాఖ పరిధిలో బొగ్గు తవ్వకాలు జరిపేందుకు ప్రతీ నాలుగేళ్లకు ఒకసారి అటవీ అనుమతులు తీసుకోవలసి ఉంటుంది. ఈ విషయంలో యాజమాన్యం నుంచి సరైన స్పందన లేకపోవడంతో కాల పరిమితి ముగిసి బొగ్గు తవ్వకాలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. అసలు అటవీ అనుమతులు లేకుండా గనిని ఎలా నడిపిస్తున్నారో సంబంధిత అధికారులకే తెలియాలి.

నాలుగేళ్ల క్రితమే ముగిసిన అనుమతులు

ఆర్కే- 7 గని 1983 నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభించింది. బొగ్గు తవ్వకాలకు సంబంధించి అటవీ అనుమతులు నాలుగేళ్ల క్రితమే 31-12-2020తో ముగిశాయి. అంతకు ముందే 2018లో ఏరియా అధికారులు లీజు రెన్యూవల్ కోసం కేంద్ర అటవీశాఖకు దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు అధికారుల నుంచి అనుమతి రాలేదు. ఈ విషయమై కేవలం ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రమే కొనసాగించగా, సింగరేణి యాజమాన్యం, తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోలేదనే ప్రచారం కార్మిక వర్గాల్లో జరుగుతోంది. గనిలోని ఒక దిశలో 20 శాతం లీజు, మరో దిశలో 80 శాతం లీజు పరిధిలో ఉన్నాయి.

డీ పిల్లరింగ్ విధానంలో రెండు సీమ్‌లు నడుస్తున్నాయి. అనుమతులు లేని కారణంగా ప్రస్తుతం ఒక సీమ్ బంద్ చేయాలనే ఆదేశాలున్నాయి. అటవీశాఖ భూములు ఉన్న ప్రాంతంలోని గనికున్న హద్దులు దాటి లోపల బొగ్గును తవ్వుతున్నందన అటవీశాఖ అభ్యంతరం చెబుతోంది. నెల క్రితమే ఏరియా అధికారులకు గని విషయంలో తాఖీదులు రాగా, సింగరేణి కార్పొరేట్ స్థాయిలో అటవీ, ప్లానింగ్, ఎస్టేట్స్ శాఖలు సమన్వయంతో పని చేసి కేంద్ర అటవీశాఖ నుంచి అనుమతి పొందాల్సి ఉంది.

బొగ్గు ఉత్పత్తిపైనా ప్రభావం..

గనిలో తొమ్మిది డ్రిల్లింగ్ మిషన్లు పనిచేస్తుండగా, అందులో అనుమతి లేని చోట ఐదింటిని ఉపసంహరించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇదే జరిగితే గనిలో జరిగే బొగ్గు ఉత్పత్తిలో సగానికిపైగా కుంటుపడే ప్రమాదం ఉంది. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపడుతోంది. ఈ క్రమంలో కేవలం అనుమతుల్లేక బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలుగనుండటంతో గని భవితవ్యం ప్రమాదంలో పడుతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అయోమయంలో కార్మికులు...

అటవీ అనుమతులు లేని కారణంగా బొగ్గు తవ్వకాలు నిలిపివేయనుండటంతో గనిలో పని చేసే కార్మికులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఆర్కే-7 గనిలో 1380 మంది కార్మికులు పనిచేస్తున్నారు. గనిలో ఉత్పత్తి నిలిపివేయాల్సి రావడంతో త్వరలో కార్మికులను యాజమాన్యం బదిలీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. సుమారు 400 మందికి పైగా ఉద్యోగులను స్థానికంగా ఉన్న ఇతర గనులకు తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై పంపించనున్నట్లు తెలుస్తోంది.

దీంతో ఉన్న ఫలంగా ఇతర గనులకు వెళ్లడంపై ఉద్యోగులు ఒకింత అసహనానికి గురవుతున్నారు. యాజమాన్యం, అధికారుల తప్పిదానికి తాము మూల్యం చెల్లించుకోవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయని మదనపడుతున్నారు. నిబంధనల మేరకు యాజమాన్యం వ్యవహరించి, అనుమతులు పొంది ఉంటే ఇబ్బందులు ఏర్పడేవి కాదనే అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ప్రత్యేక చొరవ తీసుకొని అటవీ అనుమతులు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరుతున్నారు.

త్వరలో అనుమతులు...

సీతారామయ్య, ఏఐటీయూసీ అధ్యక్షుడు

ఆర్కే-7 గని భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. త్వరలోనే అటవీ అనుమతులు వచ్చే అవకాశం ఉంది. ఈ మేరకు యాజమాన్యం, అధికారులు కృషి చేస్తున్నారు. కార్మికులను కూడా తాత్కాలికంగానే బదిలీ చేస్తారు. అదికూడా సమీపంలోని గనులకే కేటాయించడం జరుగుతుంది. తెలంగాణ ప్రభుత్వం కూడా తక్షణమే స్పందించి అటవీ అనుమతులు త్వరగా వచ్చేలా కృషి చేయాలి.

'అమ్మ మాట అంగన్‌వాడి బాట' కార్యక్రమం ప్రారంభం



మంచిర్యాలలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్, కౌన్సిలర్, దండేపల్లిలో ర్యాలీ

మంచిర్యాల అర్బన్, జూలై 15: జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రం వద్ద సోమవారం అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ సులోచన, కౌన్సిలర్ బదావత్ ప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 2 సంవత్సరాలు దాటిన పిల్లల పేర్లను ఇంటింటికి తిరిగి నమోదు చేసుకుంటామన్నారు. గర్భిణీలు, బాలింతలు, చంటిపిల్లలకు అంగన్‌వాడి కేంద్రం ద్వారా అందే సేవల గురించి తెలిపారు. అంగన్‌వాడి టీచర్లు రేణుకదేవి, సురేఖ, రాజేశ్వరి, పద్మావతి, ఐకేపీ గ్రూప్ సభ్యులు, ఆయాలు పాల్గొన్నారు.

భీమారం: మండలంలో అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రత్యేకాధికారి చిన్నయ్య, ఎంపీడీవో రాథోడ్ రాధ మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేయాలని కోరారు. రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్ల వయస్సు పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఆటాపాటలతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. హైస్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం వెంకటేశ్వర్‌రావు, ఎంపీవో శ్రీపతి బాపురావు సిబ్బంది, ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

దండేపల్లి: అంగన్‌వాడి కేంద్రంలో పిల్లలను చేర్పించా లని లక్షెట్టిపేట ఐసీడీఎస్ సీడీపీవో రేష్మ కోరారు. అంగన్ వాడి కేంద్రంలో అమ్మ మాట అంగన్‌వాడి బాట కార్యక్ర మంలో భాగంగా దండేపల్లి అంగన్‌వాడి 2వ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్ వాడి కేంద్రంలో 3ఏళ్ల దాటిన పిల్లలందరికి అక్షరాలు, అంకెలు, ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామ న్నారు. చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందిం చేందుకు కృషి చేస్తామన్నారు. ఈనెల 15 నుంచి 20వరకు వివిధ అంశాలపై కార్యక్రమాలను చేపడుతామన్నారు. దండేపల్లి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ప్రైమరీ స్కూల్ టీచర్ల, గర్భిణుల, బాలింతలు పాలొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రిటైర్డ్ ఉద్యోగుల నిరసన

నస్పూర్, జూలై 15 : రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్ అందించారు. పెన్షన్‌దారులకు బకాయి ఉన్న నాలుగు డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. ఈఎస్ఎస్ స్కీం ద్వారా అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పెన్షన్ దారులకు నగదు రహిత చికిత్సలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని కలెక్టర్‌ను కోరినట్లు నాయకులు తెలిపారు. పెన్షన్‌దారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు శంకరయ్య, రవి కుమార్, ఆగచారి, కెఎంఎస్ రెడ్డి, ఎక్బాల్, మాధవ రెడ్డి, ఎంఎస్ రెడ్డి, నర్సింగరావు, రాజన్న పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయం



గోరింటాకు వేడుకల్లో పాల్గొన్న జీఎం సతీమణి

మందమర్రి రూరల్, జూలై 15: గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయని లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు సవితా మనోహర్ పేర్కొన్నారు. సోమవారం ఇల్లందు క్లబ్‌లో గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ఆషాఢమాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వర్షాల వల్లా వాతావరణం చల్లబడి వ్యాధులు విజృంభిస్తాయని, గోరింటాకుతో ఉపశమనం కలుగుతుందన్నారు. ఒంట్లోని వేడిని తగ్గించే గునం గోరింటాకుకు ఉంటుందన్నారు. లేడీస్ క్లబ్ సెక్రెటరీ శ్రీవాణి, ట్రెజరర్ కవిత, గేమ్స్ సెక్రెటరీ ఊర్మిళ, సుప్రియ, సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

దండేపల్లి: గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆషాఢ మాసం, గోరింటాకు పెట్టుకోవడంపై హెచ్‌ఎం బొలిశెట్టి బుచ్చన్న వివరించారు. ఉపాధ్యాయురాలు కల్పన, అంగన్‌వాడి టీచర్ లక్ష్మి పాల్గొన్నారు.

గొర్రెలు రాని లబ్ధిదారుల దరఖాస్తు చేసుకోవాలి

కాసిపేట, జూలై 15: సబ్సిడీ గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులు డబ్బులు వాపసు తీసుకునేందుకు పశువైద్యశాలలో దరఖాస్తు చేసుకోవాలని పశువైద్యాధికారి తిరుపతి ప్రకటనలో తెలిపారు. డీడీలు చెల్లించి గొర్రెల యూనిట్లు పొందని రైతులు దరఖాస్తు చేసుకుంటే డబ్బులు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు.

ఎరువుల కోసం రైతుల అగచాట్లు



ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

కాగజ్‌నగర్, జూలై 15: వానాకాలం వర్షాలు కురుస్తుండటంతో రైతన్నలంతా పొలం పనుల్లో బీజీ బీజీగా ఉన్నారు. వేసిన పంటల కోసం ఎరువులు కొనుగోలు చేసేందుకు కాగజ్‌నగర్‌లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘానికి వస్తున్నారు. రైతులంతా ఒకేసారి రావడంతో ఎరువుల కేంద్రం వద్ద రద్దీ ఏర్పడుతోంది. ఫలితంగా క్యూలో గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. రద్దీ సమయంలో కౌంటర్లు పెంచి రైతులకు ఎరువులు అందించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

20 బస్తాల వరకే..

రైతులకు యూరియాకు సబ్సిడీపోను రూ.270 తీసుకుంటున్నారు. అలాగే డీఏపీ బ్యాగుకు రూ.1350 తీసుకుంటున్నారు. వీటితోపాటు నానోయూరియా బ్యాగుకు రూ.230ధరకు అందజేస్తున్నారు. 10ఎకరాల వరకు మాత్రమే 20బ్యాగులను ఇచ్చేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. 10ఎకరాలు దాటిన వారికి రెండో విడత ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటి వరకు మూడు లారీ లోడ్ ఎరువులను పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు.



కౌంటర్లు పెంచాలి..
-రాజన్న, సార్సాల

రద్దీ సమయంలో కౌంటర్లను పెంచి త్వరగా ఎరువులను అందించాలి. గంటల తరబడి రైతులను నిలబెట్టడం సరికాదు.

పిడుగుపాటుతో వడలిన పత్తి చేను



వడలిపోయిన పత్తి మొక్క

జైనూర్, జూలై 15: మండల పరిధిలోగల భుసిమెట్ట గ్రామానికి చెందిన కుంర సముద్రాబాయి తనకున్న ఏడు ఎకరాల భూమిలో పత్తిపంట సాగు చేసింది. కొద్ది రోజుల క్రితమే భర్త అనారోగ్యంతో మృతి చెందగా ముగ్గురు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూ వ్యవసాయం చేస్తోంది. అయితే ప్రకృతి కొన్నిసార్లు మన కష్టాలను లెక్కచేయదు. నాలుగురోజుల కిత్రం చేనులో ఉన్నచెట్టుపై పిడుగు పడింది. ఆ ప్రభావానికి సుమారు ఎకరం పత్తి వడలిపోయిందని బాధిత రైతు సముద్రాబాయి ఆవేదన వ్యక్తం చేస్తోంది. చేసిన అప్పులు ఎలా తీర్చాలో, యుక్త వయస్సుకు వచ్చిన పిల్లల వివాహం ఎలా చేయాలో అని ఆమె దిగాలు చెందుతోంది. ప్రభుత్వం నష్టపోయిన పత్తి పంటకు తగిన నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని బాధితురాలు కోరుతోంది.

ప్రజావాణితోనే సమస్యల పరిష్కారం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 15 : ప్రజావాణితోనే సమస్యల పరిష్కారమవుతాయని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్‌తో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ గ్రామాల నుంచి తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారి నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. ప్రజావాణిలో మొత్తం 62 దరఖాస్తులు వచ్చాయని, ప్రతీ దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులు పాల్గొన్నారు.

ఇంటింటా ఆవిష్కరణలు

ప్రభుత్వం చేపట్టిన ఇంటింటా ఇన్నోవేషన్-2024లో భాగంగా గ్రామీణ ప్రాంతాల వారు తయారు చేసిన ప్రజలకు ఉపయోగకరమైన ఆవిష్కరణలను ప్రోత్సహిస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య. సైన్స్ అధికారి మధుబాబు, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఉత్తమ ఆవిష్కరణలు సిద్ధం చేసిన వారిని స్వాతంత్ర్య దినోత్సవం రోజున సన్మానిస్తామన్నారు. జిల్లాకో యువ మిత్రను నియమించి 3 నెలల కాలానికి సమన్వయకర్తలు పనిచేసేలా ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ దరఖాస్తులను వాట్సప్ నెంబర్ 9100678543 ద్వారా పంపించాలని కోరారు.

ఎంపీ గోడం నగేష్‌కు సన్మానం



ఎంపీ గోడం నగేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

జైనూర్, జూలై 15: మండలంలోని పట్నాపూర్ గ్రామాన్ని సోమవారం ఎంపీ గోడం నగేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీగా ఎన్నికైన అనంతరం మొదటిసారిగా రావడంతో గ్రామస్థులు ఎంపీ గోడం నగేష్‌కు ఘనస్వాగతం పలి, ఘనంగా సన్మానించారు. అనంతరం ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ ప్రజలు తనపై నమ్మకంఉంచి భారీమెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆశల్ని వమ్ము చేయకుండా సమగ్రఅభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం మాన్కు, ఆత్రం సుదర్శన్, ఆత్రం రుప్‌దేవ్, పూసం జ్యోతిరాం, కురం మానిక్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌కు శుభాకాంక్షలు



తెలంగాణ రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టిన సుంకె అన్వేష్‌రెడ్డికి ఆసిఫాబాద్‌కు చెందిన కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ దుర్గంకళావతి సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

- ఆసిఫాబాద్ రూరల్

పార్కింగ్‌కు అడ్డాగా అండర్ బ్రిడ్జి

మంచిర్యాల అర్బన్, జూలై 15: పట్టణంలోని ముఖరాం చౌరస్తా సమీపంలో గల రైల్వే అండర్‌బ్రిడ్జి వాహనాల పార్కింగ్‌కు అడ్డాగా మారింది. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఆటో పాయింట్ పేరిట ఆటో డ్రైవర్లు ఆటోలను నిలుపుతున్నారు. పలు అవసరాల నిమిత్తం మార్కెట్‌కు వచ్చిన వారంతా కార్లను, ఇతర వాహనాలను అండర్‌బ్రిడ్జిలో పార్కింగ్ చేస్తున్నారు. దీంతో సగం మేర రోడ్డు వాహనాలు ఆక్రమించడంతో అండర్‌బ్రిడ్జి గుండా రాకపోకలు సాగించే వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టూటౌన్ ప్రజలు వన్‌టౌన్‌కు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి. ఈ మార్గం ఎప్పుడు రద్దీగా ఉంటుంది. ఇరుకుగా, మూల మలుపు ఉన్న రహదారిపై వాహనాలను నిలుపడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జి ప్రారంభం నుంచి మూలమలుపు వరకు వాహనాలు నిలపడంతో ప్రమాదాలకు గురయ్యే అవకాశాలు లేకపోలేదు. ట్రాఫిక్ పోలీస్‌లు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


అండర్‌బ్రిడ్జిలో పార్కింగ్ చేసిన వాహనాలు

పచ్చదనం పెంపునకు అందరూ సహకరించాలి

నస్పూర్, జూలై 15: ప్రతి ఒక్కరూ పచ్చదనం పెంపు నకు సహకరించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ ఆవరణలో సోమవారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 75వ వన మహోత్స వం సందర్భంగా అటవీ శాఖ, స్థానిక పాఠశాలల విద్యార్థులతో కలిసి కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. పచ్చదనం పెరిగితేనే స్వచ్ఛమైన గాలి, వాతావరణం లభిస్తుందన్నారు. అదనపు కలెక్టర్ మోతి లాల్, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవ్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి అనిత, నస్పూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.


మొక్కను నాటుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, జీఎం సంజీవరెడ్డి

పాఠశాలలో షీటీంపై అవగాహన

శ్రీరాంపూర్, జూలై 15 : సమాజంలో బాలికలు, మహిళలపై దారుణాలు పెరుగుతున్నాయని, ఎల్లవేళలా జాగ్రత్తగా ఉండాలని శ్రీరాంపూర్ ఎస్‌ఐ సంతోష్ పేర్కొన్నారు. షీటీం ఆధ్వర్యంలో మహిళల భద్రత-పోలీసుల బాధ్యత అనే అంశంపై ఉజ్వల ఉన్నత పాఠశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, పోక్సో కేసులు, షీ టీమ్స్, మహిళల చట్టాలు, భద్రత, ఆత్మహత్యల నివారణ, గుడ్, బ్యాడ్ టచ్, సెల్‌ఫోన్ వినియోగం, చదువు, తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా పోలీసులను సంప్రదించాలన్నారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థానాలు అధిరోహించాలన్నారు. ఎవరైనా వేధిస్తే వెంటనే షీ టీంకు ఫిర్యాదు చేయాలని, ఎటువంటి విషయాలైనా తల్లిదండ్రుల ద్వారా పోలీసుల దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని పరిశీలించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెల్‌ఫోన్‌ను అవసరమైన మేరకే వినియోగించాలని, ఎక్కువగా సోషల్ మీడియాను చూడవద్దన్నారు. చిన్న, చిన్న విషయాలకే ఒత్తిడికి లోనై ఆత్మహత్యలకు పాల్పడవద్దని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో సామర్థ్యం పెంచుకోవాలని, బాధ్యతతో పనులు చేసుకోవాలన్నారు. పెద్దలు, తల్లిదండ్రులను గౌరవించాలని కోరారు. ప్రతి స్కూల్ ఆవరణలో సీసీ కెమెరాలు అమర్చుకోవాలని ఆదేశించారు. మంచిర్యాల షీ టీం సభ్యులు, శ్రీరాంపూర్ పోలీసులు పాల్గొన్నారు.

చీటింగ్ కేసులో రౌడీషీటర్ రిమాండ్

రామకృష్ణాపూర్, జూలై 15: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఇల్లు అమ్మి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా, డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడిన గద్దెరాగడికి చెందిన రౌడీషీటర్ కూనారపు మల్లేష్‌ను సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. రాజ్‌కుమార్ అనే వ్యక్తి ఇల్లు అమ్మి డబ్బులు తీసుకొని రిజిస్ట్రేషన్ చేయకుండా రామాంజనేయులు అనే వ్యక్తికి భూమి రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. డబ్బులు తీసుకొని భూమి ఎక్కడ ఉందో చూపెట్టకుండా ఇబ్బందులకు గురి చేశాడన్నారు. ప్రజల వద్ద నుంచి అక్రమంగా డబ్బులు సంపాదిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్న మల్లేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఐకేపీ కార్యాలయంలో మందు పార్టీపై విచారణ

భీమిని, జూలై 15 : మండల కేంద్రంలోని భారతమాత మండల సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 12 రాత్రి ఐకేపీ ఏపీఎం పంజాల ప్రకాష్‌గౌడ్, మరి కొందరు వీఏఓలతో కలిసి మందు పార్టీ చేసుకున్నారనే అభియోగంపై సోమ వారం కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విచారణ జరిపారు. ఎంపీడీవో గంగ మోహన్ ఆధ్వర్యంలో కార్యాలయం పరిసరాలతోపాటు చుట్టుపక్కల వారిని, సిబ్బందిని విచారించారు. ఏపీఎం పంజాల ప్రకాష్ గౌడ్‌ను ప్రశ్నించి వివ రాలు సేకరించారు. నివేదికను కలెక్టరుకు అందజేస్తామని ఎంపీడీవో తెలిపారు. ఎంపీఓ ప్రసాద్, ఐకేపీ సిబ్బంది తదితరులు ఉన్నారు.


విచారణ చేస్తున్న ఎంపీడీవో

రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

హాజీపూర్, జూలై 15: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని ఎఫ్‌పీసీ సలహాదారుడు గోనె శ్యాంసుందర్‌రావు, గోఆధారిత రైతు మిత్ర సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నమనేని పద్మలు పేర్కొన్నారు. సోమవారం హాజీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆర్గనైజేషన్ (ఎఫ్‌పీసీ) ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతులు రసాయన మందులను వాడడం వల్ల భూమి, నీరు, గాలి కలుషితం అవుతుందని, దీంతో మానవ మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ప్రతీ రైతు అర ఎకరంలో ఐదు గుంటలు కూరగాయలు పండించాలని సూచించారు. సహజ వనరులను వాడి ఎరువులను తయారు చేసుకోవాలన్నారు. ఎఫ్‌పీసీ అధ్యక్షుడు వినయ ప్రకాశరావు, నాబార్డు డీడీఎం అబ్దుల్ రవూఫ్, రైతు సురేంద్ర, మాజీ జెడ్పీటీసీ శిల్పశ్రీనివాసరావు, శంకర్, బొలిశెట్టి తిరుపతి, రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎఫ్‌పీసీ సలహాదారుడు శ్యాంసుందర్‌రావు

న్యాయం చేయాలని బాధితురాలి ఆందోళన


ఫ్లెక్సీతో ఆందోళన చేస్తున్న బాధితురాలు

దండేపల్లి, జూలై 15: అత్తింటి వారు వేధింపులకు గురి చేస్తూ భర్తను తన నుంచి వీడదీస్తున్నారని ఓ యువతి సోమవారం మండల కేంద్రంలోని ఆడపడుచు ఇంటి ఎదుట ఆందోళనకు దిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏలూరు జిల్లా టంగుటూర్ మండలం కైకారం గ్రామానికి చెందిన సౌజన్య మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన ఇప్ప ప్రవీణ్‌కుమార్‌తో 2013లో ప్రేమ పెళ్లి చేసుకుంది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నాడు. తన భర్త రెండో పెళ్లి చేసుకున్నాడని, అందుకు ఆడపడుచు మౌనికే కారణమని ఆమె ఇంటి ఎదుట బాధితురాలు సౌజన్య కుమారుడితో న్యాయం చేయాలని ఫ్లెక్సీతో ఆందోళనకు దిగింది. ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను వివరణ కోరగా 2023లో ఏలూరు జిల్లా చేబ్రోలు పోలీసుస్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదయ్యాదన్నారు. బాధితురాలితో మాట్లాడి నచ్చజెప్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. రెండు చోట్ల కేసులు నమోదు చేయలేమని, బాధితురాలుకి న్యాయం చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎమ్మెల్యేలు విఫలం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 15: జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల ఎమ్మెల్యేకు మంత్రి పదవిపై ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలపై లేదని ఆరోపించారు. ఎల్లంపల్లి బాధితుల సమస్యలు పరిష్కరిస్తానని చెప్పిన దానిని పట్టించుకోవడం లేదన్నారు. గత కార్యవర్గ సమావేశంలోని తీర్మానాలను ఏకగ్రీవంగా అమలు చేసేందుకు నిర్ణయించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఉద్యమిస్తామని తెలిపారు. రజనీష్ జైన్, పెద్దపల్లి పురుషోత్తం, కొయ్యల ఏమాజీ, అమరాజుల శ్రీదేవి, శ్రీనివాస్, నర్సింహులు, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి


కాసిపేటలో ఫిర్యాదు అందజేస్తున్న బీజేపీ నాయకులు, భీమారంలో దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో

భీమారం, జూలై 15: మండలంలోని వివిధ గ్రామాల ప్రజల సమస్యలు సత్వరం పరిష్కరించేందుకే ప్రజావాణి అని ఎండీపీడో రాథోడ్ రాధ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మూడు దరఖాస్తులు వచ్చాయి. భీమారం బస్టాండ్‌లో నివాసం ఉంటున్న ఆకుదారి పోసు 25 ఏళ్లుగా భీమారంలో నివాసం ఉంటున్నానని, ఇంటి నంబరు మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ ఇవ్వాలని, చర్చి రోడ్డు వద్ద డ్రైనేజీ సమస్య ఉందని, వ్యర్థాలు విపరీతంగా వస్తున్నాయని, ఇంటి ఎదుట నీరు నిలిచిపోతోందని, సమస్య పరిష్కరించాలని ప్రత్యేకాధికారిని కోరారు. అధికారులు పాల్గొన్నారు.

ఊత్కూర్ చౌరస్తాకు అంబేద్కర్ పేరు పెట్టాలి

లక్షెట్టిపేట రూరల్: లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని ఊత్కూర్ చౌరస్తాకు అంబేద్కర్ చౌక్‌గా పేరు పెట్టాలని అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడు తొగరు రాజు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మున్సి పల్ చైర్మన్ నల్మాసు కాంతయ్యకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ పేరు పెట్టేలా కౌన్సిల్‌లో తీర్మానం చేయాలని కోరారు. దమ్మ నారాయణ, మాలెం చిన్నన్న, రవి, లింగన్న, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

భూ ఆక్రమణపై చర్యలు తీసుకోవాలి

మందమర్రి రూరల్: భూమి ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బుదరగూడం వాసులు ప్రజావాణిలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. 80 ఏళ్ల నుంచి తాతలు, తండ్రుల కాలం నుంచి ఆ భూమిలో అంత్యక్రియలు చేసుకుంటూ, చనిపోయిన వారి గుర్తుగా గోరీలు కూడా నిర్మించుకున్నామన్నారు. కొందరు అక్కడ ఉన్న గోరీలను తొలగించి భూమిని కబ్జా చేయాలని చూస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజావాణికి అధికారుల గైర్హాజరు

కాసిపేట: ప్రజావాణికి వ్యవసాయ అధికారి వందన మినహా ఇతర అధికారులు హాజరు కాకపోవడం విమర్శలకు దారితీసింది. దరఖాస్తులు ఇచ్చేందుకు కొందరుబాధితులు రాగా అధికారులు అందుబాటులో లేరు. జూనియర్ అసిస్టెంట్లు స్వామి, తిరుపతిలకు వినతిపత్రాలు అందజేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజాసంఘాల నాయకులు, కోరారు.

-ప్రభుత్వ భూమికి నష్టపరిహారం ఎలా...

పెద్దనపల్లి శివారులోని సర్వే నంబరు 5లో ఉన్న ప్రభుత్వ భూమికి నష్టపరిహారం ఎలా చెల్లిస్తారని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కళ్యాణిఖని, ఓసీపీలో ముంపునకు గురవుతుందని 5-79 సర్వే నంబరులో 16 ఎకరాల భూమికి నోటిఫికేషన్ ఇచ్చారు. మళ్లీ ఇదే భూమిపై నష్టపరిహారం పొందేందుకు అధికారులు, కొందరు ప్రజాప్రతినిధులు కుమ్మక్కై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి నష్టపరిహారం నిలిపి వేయాలని కోరారు.

కార్పొరేషన్ సరిహద్దుల గుర్తింపు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: ఆసిఫాబాద్ మున్సిపాలిటీ రాజంపేట గ్రామపంచాయతీల సరిహద్దులను సోమవారం మున్సిపల్ కమిషనర్ భుజంగరావు గుర్తించారు. రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలో అటవీశాఖ చెక్‌పోస్టు వెనుక నుంచి పద్మశాలి భవనం, ఎస్‌ఎం గార్డెన్ నుంచి టీఆర్‌నగర్‌వరకు, హోలీట్రినిటీ నుంచి వాసవి భవన్ వరకు, ఆర్టీసీపెట్రోల్ బంక్ నుంచి ఆంజనేయ సామిల్ వరకు, ఎస్పీక్యాంపు ఆఫీస్ నుంచి జుబ్లీ మార్కెట్ వరకు, జుబ్లీ మార్కెట్ నుంచి సత్యసాయి టెంపుల్ వరకు, రాజంపేట గ్రామపంచాయతీ సరిహద్దులను గుర్తించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది సంతోష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

వాంకిడి, జూలై 15: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని ఎస్సై సాగర్ అన్నారు. సోమారం అర్గగూడ ప్రాథమిక పాఠశాలలో మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. అనంతరం వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో నారాయణ, ప్రశాంత్, అనీల్, గణేష్, దాదాజీ, జయరాం, దీపక్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలి

లింగాపూర్, జూలై 15: గ్రామాల్లో పారిశుధ్య పనులను పకడ్బందీగా నిర్వహించాలని మండలపంచాయతీ అధికారి ఉమర్‌శరీఫ్ అన్నారు. సోమవారం మండలకేంద్రంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం గ్రామాల్లో పారిశుధ్యం లోపించ కుండా ప్రతిరోజుచర్యలు తీసుకోవాలని సిబందికి సుచించారు. దోమలువ్యాప్తి చెందకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్య దర్శి కార్తీక్‌రెడ్డి, కారోబార్ విజేస్, తిరుపతి, తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతులు


గుంతలను పూడ్చి వేయిస్తున్న పోలీసులు

సిర్పూర్(టి), జూలై 15: సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారి వెంపల్లి రైల్వేగేటు వద్ద రోడ్డు వర్షానికి పెద్దపెద్ద గుంతలు పడడంతో సిర్పూర్(టి) ఎస్సై దీకొండ రమేష్ స్పందించారు. మొరం వేయించి గుంతలను పూడ్చి వేయించారు. దీంతో వాహన దారులు పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు. ఆర్‌అండ్‌బీ శాఖాధికారులు స్పందించకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేడు దివ్యాంగులకు రాయితీ బస్‌పాసు మేళా

దహెగాం, జూలై 15: మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం రాయితీపై దివ్యాంగులకు బస్‌పాస్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేందర్ తెలిపారు. దివ్యాంగులు మేళాకు సదరం సర్టిఫికెట్ జిరాక్స్‌తో హాజరు కావాలన్నారు.

కొనసాగుతున్న మొహర్రం


కాగజ్‌నగర్ బారెగూడలో పీరీలతో ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: త్యాగాలకు ప్రతీకగా జరుపుకునే మొహర్రం సోమవారం 7వ రోజు ఘనంగా జరుపుకున్నారు. మలీద ముద్దలు, బెల్లం షర్బత్ ప్రత్యేక వంటకాలతో డప్పు చప్పుడుల నడుమ వేలాదిమంది భక్తులు పీరీలకు మొక్కులు సమర్పించారు. అనంతరం బంగ్లా నుంచి పీరీలను నృత్యాలుచేస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు హనీస్, సుధాకర్, నారాయణ, బాబా, రఫీక్, రాకేష్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.


సిర్పూర్(టి): మండలకేంద్రంలోని చాకలి వాడలో సోమవారం 8వరోజు మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పీరీలను పలుకాలనీల్లో ఊరేగించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. బస్టాండు ఏరియాలో షరబత్(బెల్లం పానకం)ను పంపిణీ చేశారు.


మొహర్రం పండుగ పవిత్రమైనది: ఎమ్మెల్యే

జైనూర్: పండుగల్లో కెల్లా మొహర్రం పండుగ అతి పవిత్రమైందని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని పవర్‌గూడలో కొనసాగుతున్న మొహర్రం వేడుకల్లో సోమవారం ఆమెపాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదివాసులతోకలిసి నృత్యాలుచేశారు. అంతకుముందు మాజీఎంపీటీసీ కుంరభగ్వంత్‌రావ్ మీసేవా కేంద్రాన్నిఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, మాజీగ్రంథాలయచైర్మన్ కనక యాదవ్‌రావ్, కుంరశాంరావ్, డిప్యూటీ తహసీల్దార్ బీర్షావ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాల తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్: కాగజ్‌నగర్ మండలం బారెగూడలో సోమవారం పీరీల ఊరేగింపు నిర్వహించారు. మంగళవారం పెద్దసరిగత్ ఉంటుందని, భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

రెబ్బెన: మండలంలోని పుంజుమేరగూడలో భువమ్మ తల్లి ఆలయంలో సోమవారం చిన్నసరిగెత్తు సందర్భంగా భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ఉదయంనుంచే ఆలయానికి వచ్చారు. భక్తులకోసం ఆలయ కమిటీవారు అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే అన్నదానం నిర్వహించారు. మంగళవారం ఉదయం పెద్దసరిగెతు రాక సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకోవాలని అధ్యక్షుడు వినోద్ జైశ్వాల్, వ్యవస్థాపకుడు నికాడ్‌శీకర్, శ్రీకాంత్, తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు నిమ్మాజీ, భవనాన్, రాకేష్, వెంకటి, బొడ్డు రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో పీరీలను ఊరేగిస్తున్న ముస్లింలు


జైనూర్‌లో మహిళలతో కలిసి నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి


రెబ్బెనలో చిన్న సరిగెతు వద్ద భక్తులు

ఉపాధ్యాయుల మధ్య కలహాలు

● బడికి తాళం వేసిన గ్రామస్థులు


విచారణ జరుపుతున్న ఎంఈవో మనుకుమార్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు పాఠశాలలో గొడవపడడంతో విద్యార్థులు గ్రామంలోకి పరిగెత్తడం గ్రామ స్థులువచ్చి పాఠశాలకు తాళం వేయడం ఆసిఫాబాద్ మండలంలో కలకలం రేపింది. వివరాల్లోకివెళ్తే.. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో 68మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, గతంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడుగా పనిచేశాడు. ప్రధానోపాధ్యాయుడు అనంతరావు, ఉపాధ్యాయుడు తిరుపతి మధ్య గత శుక్రవారం గొడవ జరిగింది. శని, ఆదివారాలు సెలవు దినాలు కావడంతో సోమవారం గ్రామస్థులు పాఠశాలకు చేరుకొని విషయం తెలుసుకోవడానికి ప్రయత్నించారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకొని ఉన్నతాధికారులు స్పందించాలనే ఉద్దేశ్యంతో పాఠశాలకు తాళం వేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పాఠశాల అభివృద్ధి నిధుల్లో భాగంగా ఇద్దరి మధ్య గొడవలు వచ్చినట్లు తెలియజేశారు. సదరు ఉపాధ్యాయులను పాఠశాలనుంచి తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. అయితే ప్రధానోపాధ్యాయుడు సోమవారం పాఠశాలకు రాకపోవడంతో గ్రామస్థులు పాఠశాల ఎదుట బైఠాయించారు. ఇదే సందర్భంలో ఎంఈవో మనుకుమార్ అక్కడికి చేరుకుని గ్రామస్థులను సముదాయించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ గ్రామస్థులు వినకపోవడంతో మంగళవారం గ్రామస్థుల సమక్షంలో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయుడితో మాట్లాడుతామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు వెళ్లిపోయారు.

రెండో ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలి

రెబ్బెన, జూలై 15: రాష్ట్రంలోని ఎన్‌హెచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న 2వ ఏఎన్‌ఎంలను ఎలాంటి షరతులు లేకుండా వెంటనే రెగ్యులర్ చేయాలని సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రెండో ఏఎన్‌ఎంలు రెబ్బెన పీహెచ్‌సీ మెడికల్ అధికారి సుజిత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్‌ఎచ్‌ఎం స్కీంలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎంలను వెంటనే పర్మినెంటు చేయాలని డిమాండు చేశారు. లేనిపక్షంలో దశలవారీ పోరాటం చేస్తామన్నారు.

నాటుసారా, పటిక పట్టివేత

కాగజ్‌నగర్/దహెగాం, జూలై 15: దహెగాంమండలంలోని మర్రిపల్లి, దహెగాంలలో సోమవారం నాటుసారా కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఈ దాడుల్లో 10లీటర్ల నాటుసారాతో పాటు 630కిలోల పటికను, బొలేరో వాహనం స్వాధీనపర్చుకుని గురిజాల నరేష్, మర్రిపల్లి చందుపై కేసు నమోదు చేసినట్లు తెలి పారు. ఈ దాడుల్లో ఎస్సై సురేష్, సిబ్బంది శ్రీనివాస్, సతీష్, మల్లేష్‌కుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

కెరమెరి, జూలై 15: మండలంలోని మోడి కేజీబీవీ పాఠశాలలో రూ.4లక్షలతో నిర్మిస్తున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను సోమవారం నోడల్‌అధికారి ప్రకాష్ పరిశీ లించారు. తాగునీరు, మూత్రశాలలు, ఇతర మౌలిక వసతులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అలాగే సుర్దాపూర్ పాఠశాలను సందర్శించి ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎస్‌వో మీనాకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాటను విజయవంతం చేయాలి

● జిల్లా శిశు సంక్షేమాధికారి భాస్కర్

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని, పాఠశాలల్లో చేరేనాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్ర మానికి శ్రీకారం చుట్టిందని జిల్లా శిశుసంక్షేమ శాఖాధికారి భాస్కర్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కస్బావాడీ, బజార్‌వాడి నెం.1కేంద్రాల్లో నిర్వహించిన అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని సీడీపీవో సాదియారుక్సానా, సూపర్‌వైజర్ సుజాత, సిబ్బందితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు కేంద్రాలకు రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను చేర్పించేందుకు సోమవారం నుంచి ఈనెల20వరకు సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమాన్ని ప్రతిఅంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారానే అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు ఉచితంగా యూనిఫాం కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారుల నమోదు శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పంచదార లక్ష్మి, మంజుల తదితరులు పాల్గొన్నారు.


ఆసిఫాబాద్‌లో కార్యక్రమం ప్రారంభిస్తున్న శిశు సంక్షేమాధికారి భాస్కర్

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ

వాంకిడి: ప్రభుత్వం ప్రారంభించిన అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో రిబ్కా మాట్లాడుతూ అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సహకరించాలన్నారు. ఈనెల20వ తేదీవరకు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించి రెండున్నరేళ్ల నుంచి ఐదేళ్లపిల్లల వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు ఆకర్షితులయ్యేలా అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లలు పాల్గొన్నారు.

దహెగాం(పెంచికలపేట): మండలంలోని సంజీవ్‌నగర్‌లో సోమవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మమాట- అంగన్‌వాడీబాట కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ హసీనా ప్రారంభించారు. కార్యక్రమంలో సీడీపీవో సురేఖ, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



మహిళలకు మీ సేవ కేంద్రాలు



మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. జిల్లాలో మండలానికి ఒకటీ, రెండు ఉన్న మీ సేవ కేంద్రాలను ఎక్కువ చేసి మహిళా సంఘ సభ్యులతో నిర్వహించాలను కుంటోంది. ఆ దిశగా మండలాలకు మీ సేవ కేంద్రాల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేసింది.

మండలాల వారీగా మీ సేవ కేంద్రాలు..

- ఆసిఫాబాద్	09	- సిర్పూర్(టి)	03
- బెజ్జూర్	05	- సిర్పూర్(యు)	03
- దహెగాం	04	- తిర్యాని	04
- జైనూర్	05	- వాంకిడి	07
- కాగజ్‌నగర్	09	- లింగాపూర్	04
- కెరమేరి	04	- పెంచికల్‌పేట్	03
- కౌటాల	06	- చింతలమానేపల్లి	05
- రెబ్బెన	05		

- జిల్లాలో 78 మీసేవా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు
- మహిళాశక్తి పేరిట మంజూరు
- మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు

వాంకిడి, జూలై 15: ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. ఆ క్రమంలోనే మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసి సదరు సేవలను స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తోంది. చదువుకున్న మహిళలకు పని కల్పించడమే కాకుండా ఉద్యోగ భృతి లభిస్తుందన్నది ప్రభుత్వసంకల్పం. పట్టణాలు, కొన్ని గ్రామ పంచాయతీలకే పరిమితమైన మీసేవ కేంద్రాలను అత్యవసరమున్న పల్లెల్లోను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా వ్యాప్తంగా మహిళ శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు వీటిని మంజూరు చేయనుంది. ఇప్పటికే ఎంపిక ప్రక్రియ మొదలైనట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.

తగ్గనున్న దూరభారం

జిల్లాలో మండలకేంద్రాలు, పట్టణాల్లోనే అత్యధికంగా మీ సేవా కేంద్రాలు ఉన్నాయి. తాజాగా ప్రభుత్వ నిర్ణయం మేరకు జిల్లా వ్యాప్తంగా 78 మీసేవా కేంద్రాలను ప్రారంభించే యోచనలో అధికారులు ఉన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలు పొందాలన్నా, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకోవాలన్నా మీ సేవ కేంద్రాల ద్వారా ధ్రువపత్రాలు అవసరమవుతాయి. అందుకే మీసేవ కేంద్రాల్లో ప్రజలు బారులు తీరుతున్నారు. దూరాభారంతోపాటు ఆర్థికంగా ప్రజలు నష్టపోవాల్సి వస్తోంది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో గ్రామీణులకు మీసేవ కేంద్రాల సేవలు మరింత చేరువ కానున్నాయి.

మహిళలకు ఆర్థిక స్వావలంబన
మహేష్, ఏపీఎం, వాంకిడి



ప్రభుత్వం తాజాగా తీసుకున్న మీసేవ కేంద్రాల నిర్వహణ మహిళా సంఘసభ్యుల ద్వారా నిర్వహణ జరిగితే వారిలో వ్యాపార ధోరణి, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. స్వయం సహాయక సంఘాల సభ్యుల్లో చదువుకున్న సభ్యులను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో తోడ్పడతాయి. వాంకిడి మండలంలో 7మీ సేవ కేంద్రాలు ఏర్పాటు చేస్తుండగా జిల్లాలో మొత్తం 78కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

రుణసాయం..

లబ్ధిదారులకు పెట్టుబడి సమస్య తలెత్తకుండా ఒక్కో కేంద్రానికి రూ.2.50లక్షల చొప్పున రుణాలను స్త్రీనిధి ద్వారా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేస్తుంది. ఈ నిధులతో అధికారుల పర్య వేక్షణలో పేరొందిన కంపెనీల నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు, తదితర ఎలక్ట్రానిక్ పరికరాలు కొనాల్సి ఉంటుంది. మీ సేవ కేంద్రాలు ప్రారంభమైన తర్వాత ఆయా సంఘాలు రుణాలను తిరిగి చెల్లించాలి. ఇంటర్ పాసైన సభ్యులను ఆపరేటర్లుగా ప్రభుత్వం ఎంపిక చేస్తుంది. దీనికి మీసేవ సంస్థ ద్వారా నెల రోజుల పాటు శిక్షణ ఇస్తుంది. ఆగస్టు 15 నాటికి కొత్త మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.



సమావేశంలో పాల్గొన్న మహిళలు (ఫైల్)

మహిళాశక్తి పథకంలో యూనిట్ల గుర్తింపును వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మహిళాశక్తి పథకంలో యూనిట్ల గుర్తింపు ప్రక్రియను వేగవంతంచేయాలని అదనపుకలెక్టర్ దీపక్‌తివారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో మహిళాశక్తి పథకం యూనిట్‌లు గుర్తించడంపై సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టుమేనేజర్లు, జిల్లామేనేజర్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిమండలంలో మహిళా సంఘాలతో సమావేశంనిర్వహించి ఔత్సాహిక మహిళాసంఘాలను మహిళాశక్తి పథకంద్వారా యూనిట్లు ప్రారంభించే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. చేపల పెంపకం, కోళ్లపెంపకం, డెయిరీ ఫార్మ్ నిర్వహణ, క్యాంటీన్లు, మీ సేవకేంద్రాల నిర్వహణ, చిన్నపరిశ్రమల ఏర్పాటు వంటివిరకాల యూనిట్‌లను గుర్తించి మహిళాసంఘాలు ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ సంఘాలకు స్త్రీనిధి పథకంద్వారా రుణాలను అందించి ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం మండలాలవారీగా యూనిట్లపై సమీక్షించారు. సమావేశంలో జిల్లా అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ, స్త్రీనిధి రీజనల్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విచారణ ఖైదీలతో సరిగ్గా వ్యవహరించాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజు

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: విచారణ ఎదు ర్కొనే ఖైదీలపట్ల సరిగ్గా వ్యవ హరించి సరైన విచారణ జరి పేలా చూడాలని సీనియర్ సివిల్‌జడ్జి యువరాజు అన్నా రు. తన కార్యాలయంలో విచారణ ఎదుర్కొనే ఖైదీలకు సంబంధించి అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జైలుజీవితం అనుభవిస్తున్న ఖైదీలు విచారణ ఎదుర్కొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖైదీలు విచారణ అనంతరం బయటికి వెళ్లే పరిస్థితి ఉంటే వారికిసమాజంలో పరిస్థితులపై అవగాహనకల్పించాలన్నారు. మళ్లీ అటువంటి నేరంజరగకుండా చూడాలని సూచించారు. జైలులో సత్ప్రవర్తన కలిగిన ఖైదీ లను విచారణకు హాజరయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్య క్రమంలో సబ్‌జైలర్ ప్రేంకుమార్, డీసీఆర్బీసీఐ రమేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు



కాగజ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, జూలై 15: నిరుద్యోగులకు సంఘీభావంగా వివిధ నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్న బీఆర్ఎస్ నాయకులను సోమవారం కాగజ్‌నగర్ పోలీసులు ముందస్తు అరెస్టుచేశారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల విషయంలో తప్పుడు నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వెంటనే డీఎస్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో నాయకులు దాసరి నరేందర్, రాజు, టక్కరి పోశం, శ్రీనివాస్, శోభన్, ధర్మేందర్, పాషా, మహిమూద్‌లతో పాటు తదితరులున్నారు.

జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: జిల్లాస్థాయి పోస్టర్‌మేకింగ్ పోటీలు ఆసిఫాబాద్ పట్టణంలోని జడ్పీసెకండరీ పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఈవో అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవివర్మ లాంటి చిత్రకారులను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాగా ప్రథమబహుమతి రెబ్బెన మండల జడ్పీఉన్నతపాఠశాలకు చెందిన ఎస్ కృష్ణ, ద్వితీయ బహుమతి ఆసిఫాబాద్‌కు చెందిన జిజాప్నవి, తృతీయ బహుమతి గంగాపూర్‌కు చెందిన రామ్‌చరణ్ గెలుచుకోగా వారికి నగదు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖాధికారులు శ్రీనివాస్, శేఖర్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

ఆసిఫాబాద్ రూరల్, జూలై 15: జిల్లాలో సోమవారం ఓమోస్తరు వర్షం కురి సింది. ఆసిఫాబాద్ జిల్లాలోగడిచిన 24గంటల్లో జిల్లావ్యాప్తంగా 8.6మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. అత్యధికంగా పెంచికలపేటలో 30.2మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా జైనూరులో 1మిల్లీమీటర్ వర్షం కురిసింది. మిగితా మండలాలైన దహెగాంలో 25.8మిల్లీమీటర్లు, బెజ్జూరులో 20, రెబ్బెనలో 11.8, తిర్యాణిలో 9, కాగజ్‌నగర్‌లో 8.6, వాంకిడిలో 8.2, కెరమెరిలో 4.2, లింగాపూర్‌లో 3.6, ఆసిఫాబాద్‌లో 3, సిర్పూర్(యు)లో 2, సిర్పూర్(టి) లో 1.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయింది.

సమస్యలను పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

కాగజ్‌నగర్, జూలై 15: కాగజ్‌నగర్ పట్టణ నాయిబ్రాహ్మణ సేవాసంఘం సభ్యులు సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో నాయిబ్రాహ్మణకులానికిచెందిన జంపాల సతీష్, జంపాలగణేష్ కలిసికులానికి కట్టుబాటు ఉండకుండా తమ వృత్తిని ఇతరరాష్ట్రాలకు చెందినవారితో చేయిస్తున్నారని వివరించారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఈసుగాం ఆలయంలో పూజలు

కాగజ్‌నగర్, జూలై 15: మండలంలోని ఈసుగాం శివాలయంలో సోమవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు పూజలు నిర్వహించారు. మహంకాళి అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అంకరించారు. శివాలయంలో శివలింగానికి పూజలు, క్షీరాభిషేకాలు నిర్వహించారు.

నేత్ర పర్వంగా జగన్నాథుడి రథయాత్ర

కాగజ్‌నగర్, జూలై 15: కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్ క్యాంపులో సోమవారం సాయంత్రం జగన్నాథుడి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ యాత్ర 12వక్యాంపు నుంచి ప్రారంభమై పలు కూడళ్ల గుండా సాగింది. ఈ యాత్రలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్నాథుడి రథయాత్రలో పాల్గొనటం సంతోషంగా ఉందన్నారు.

18న వాహనాలకు వేలం

ఆసిఫాబాద్ రూరల్/ కాగజ్‌నగర్, జూలై 15: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను ఈనెల 18న ఆసిఫాబాద్, కాగజ్ నగర్‌లలోని ఆబ్కారీ కార్యాలయాల్లో వేయనున్నట్లు ఆసిఫాబాద్ ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దీపక్, కాగజ్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై దీపక్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 50శాతం డిపాజిట్ చెల్లించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలి: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 15: జిల్లా అభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీఅధికారి నీరజ్‌కుమార్‌తో కలిసి ప్రభుత్వశాఖల జిల్లాఅధికారులతో జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధిపనులు, సంక్షేమ పథకాలఅమలుపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్నిరంగాల్లో ముందు ఉంచేలా అధికారులు సమష్టిగాకృషి చేయాలన్నారు. జిల్లాఅభివృద్ధి, ప్రజలసంక్షేమం దిశగా సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. వనమహోత్సవం కింద జిల్లాలోని అన్ని శాఖలకు 53లక్షల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఈనెల 31వ తేదీవరకు లక్ష్యాన్ని పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మహిళాశక్తి పథకం ద్వారా మహిళా సంఘాలను బలోపేతం చేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. అమ్మఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేసే విధంగా అధకారులు పర్యవేక్షించాలన్నారు. వ్యవసాయపరంగా రైతులకు సరిపడా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని అందరం సమష్టిగా ప్లాస్టిక్‌రహిత సమాజాన్ని నిర్మిద్దామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సిర్పూర్ పేపర్‌మిల్లు లిమిటెడ్ ఆధ్వర్యంలో కళాకారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవో సురేష్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిసేధితప్లాస్టిక్‌వాడకాన్ని అందరూ సమష్టిగా నిరోధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల భావితరాలకు జరిగేనష్టాన్ని ప్రజలకు అవగాహన కార్యక్రమాల ద్వారా వివరించి చైతన్యం చేయాలన్నారు. అనంతరం స్వచ్ఛతపై అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్లు ప్రతినిధులు రీనాజార్జ్,అశోక్,కళాకారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి..

సమస్యలపై ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపుకలెక్టర్ దాసరి వేణు, ఆర్డీవోలు సురేష్‌తో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం అంకుశాపూర్ గ్రామానికి చెందిన విఘ్నేశ్వర్ కుమారుడికి బెస్ట్ అవైలబుల్ పాఠశాలలో ప్రవేశం కల్పించాలని దరఖాస్తు అందజేశాడు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామానికి చెందిన అర్చన తనకు మైనార్టీ గురుకులంలో పొరుగుసేవలో ఉపాధి కల్పించాలని, కాగజ్‌నగర్ మండలం ఈసుగాంకు చెందిన విమల తాను దివ్యాంగురాలినని తనకు దివ్యాంగపెన్షన్ ఇప్పించాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం సాలెగూడ గ్రామపంచాయతీ భాగ్యనగర్ కాలనీకిచెందిన రాజేశ్వరి అడప్రాజెక్టు పునరావాసంలో భాగంగా కాలనీలో ఒకేనెంబర్‌గల ప్లాటును ఇద్దరికి కేటాయించారని సమస్యను పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రాజురా గ్రామస్థులు తమగ్రామాన్ని మోతుగూడగ్రామ పంచాయతీ నుంచి తొలగించి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం ఖమానగ్రామానికి చెందిన యశోద తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అప్పల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీకి చెందిన రైతులు తమకు ఇంటిస్థలాలు కేటాయించాలని, కౌటాల మండలా నికి చెందిన బాబురావు తనభూమిని కొంతమంది ఆక్రమించుకునే ప్రయత్నిస్తున్నారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. తిర్యాణి మండలం రొంపల్లికి చెందిన బాపురావు తనపేరిట గల పట్టాభూములను పాసుపుస్తకంలో నమోదు చేసి మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూరు మండలం ఊసేగాం గ్రామానికి చెందిన అరుణబాయి తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

పత్తిచేనులో కలుపు కష్టాలు

- కూలీలు దొరకక రైతుల గోస



పత్తి చేనులో కలుపును తొలగిస్తున్న కూలీలు

చింతలమానేపల్లి, జూలై 15: రైతులు సాగు చేసిన పత్తి చేనులో కలుపు కష్టాలు మొదలయ్యాయి. పత్తి పంటలో సాలు మధ్యలో పచ్చిగడ్డి విపరీతంగా పెరగడంతో నివారించేందుకు కొందరు రైతులు వివిధ రకాల మందులను పిచికారి చేస్తున్నారు. మరికొందరు రైతులు కూలీలను పెట్టి కలుపును తీయిస్తున్నారు. సకాలంలో కూలీలు దొరకకపోవడంతో విపరీతంగా గడ్డి పెరిగిపోతుందని రైతులు అంటున్నారు. ఆయా గ్రామాల్లోని కలుపు తీసేందుకు కూలీలకు సగటున రోజుకు రూ.300చొప్పున చెల్లిస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు.



భూగర్భ గనులు మూసివేస్తే వ్యతిరేకత తప్పదు

శ్రీరాంపూర్, జూలై 15: సింగరేణిలో భూగర్భ గనులు మూసివేస్తే తీవ్ర వ్యతిరేకతతప్పదని హెచ్‌ఎంఎస్ రాష్ట్రప్రధానకార్యదర్శి ఎండీ రియాజ్ అహ్మద్ హెచ్చరించారు. ఏరియానాయకులతో కలిసి సోమవారం ఆయన ఆర్కే7 గనిని సందర్శించి, కార్మికులకు భరోసాకల్పించారు. అనంతరం మాట్లాడుతూ, భూగర్భ గనులు లేకుండా చేయాలని సింగరేణి యాజమాన్యం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. అందులో భాగంగానే ఆర్కే7 గనిపై పడ్డారని అన్నారు. గని కార్మికులు ఎలాంటి ఆందోళన చెందవద్దని, న్యాయం జరిగే వరకు యాజమాన్యం పక్షాన పోరాడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్‌రెడ్డి, అధికారి ప్రతినిధి జీవన్‌జోయల్, నాయకులు రాజేంద్రప్రసాద్, చెవుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్కే7 గనికి అనుమతి ఇప్పించండి'

శ్రీరాంపూర్, జూలై 15: శ్రీరాంపూర్‌లోని ఆర్కే7 గనికి అటవీశాఖ నుంచి అనుమతులు ఇప్పించాలని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కె బాజీసైదా కలెక్టర్ కుమార్ దీపక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 2020నాటికి అనుమతి ఉన్నప్పటికీ2018లోనే అధికారులు ఎక్స్‌టెన్షన్ కోసం కేంద్రఅటవీశాఖకు లేఖరాశారన్నారు. కానీ అక్కడి నుంచి ఇంతవరకు అనుమతిరాలేదని తెలిపారు. ఈనేపథ్యంలో కేంద్రం నుంచి అనుమతి వచ్చేవరకు గనిలో బొగ్గుఉత్పత్తి కొనసాగేలా అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లాకార్యదర్శి మేకల దాసు, బ్రాంచ్‌ఏరియాకార్యదర్శి మారపల్లి సారయ్య, కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్,నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి గనులను వేలం నుంచి మినహాయించాలి



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, జూలై 15: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలం నుంచి మినహాయించాలని సింగరేణి కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి, అనంతరం జీఎం బి సంజీవరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్రం తలపెట్టిన వేలం నుంచి సింగరేణి బొగ్గు బ్లాకులను తీసివేయాలన్నారు. వాటిని సింగరేణికి అప్పగించి సంస్థ భవిష్యత్తును కాపాడాలన్నారు. ఈ సందర్భంగా అరుణోదయ మల్లన్న బృందం సభ్యులు పాడిన పాటలు, ఆడిన ఆటలు అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల నారాయణ, రియాజ్ అహ్మద్, ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కార్యదర్శి వి అనిల్ రెడ్డి, ఐఎఫ్‌టీయూ జాతీయ కార్యదర్శి టి శ్రీనివాస్, రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించిన అంగన్‌వాడీ సిబ్బంది



ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు



కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే హరీష్‌బాబు ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ఆసిఫాబాద్ రూరల్/కాగజ్‌నగర్, జూలై 15: అంగన్‌వాడీటీచర్లు, హెల్పర్స్‌సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించాలని సోమవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మికి, కాగజ్‌నగర్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబుకు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు,ఆయాలు వినతిపత్రం అందజేశారు. అంతకుముందు వారు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌లలో ఎమ్మెల్యే నివాసాలవరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2023సెప్టెంబరు 11 నుంచి అక్టోబరు4 వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరవధికసమ్మె చేయడంతో అప్పటి రాష్ట్రమంత్రి హరీష్‌బావు, మంత్రి సత్యవతిరాథోడ్ చర్చలు జరిపి రిటైర్‌మెంట్ బెనిఫిట్ రూ.లక్ష, టీచర్‌లకు రూ.2లక్షలు, ఆసరా పెన్షన్, 6సంవత్సరాలకు రిటైర్మెంట్ అయిన వారికి వీఆర్ఎస్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చారన్నారు. రెండో పీఆర్సీలో 5శాతం ఐఆర్ ప్రకటించారని కానీ హామీలు అమలు కావడం లేదన్నారు. ఆసిఫాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో నాయకులురాజేందర్, గంగామణి, శ్రీకాంత్, వని, పార్వతి, ఉమ, రాజేశ్వరి, తార, సరోజ,లత, శీల తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌లో అంగన్‌వాడీ వెల్ఫేర్స్‌అండ్ వర్కర్స్ జిల్లా ప్రధానకార్యదర్శి త్రివేణి, సీఐటీయూ జిల్లాకార్యదర్శి ముంజంశ్రీనివాస్, అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణమాచారితోపాటు జిల్లా కమిటీ సభ్యులు మాచర్ల వినోద, కృష్ణవేణి, మైఅరుణ, మండలాలు, జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా రూరల్ సీఐ అల్లం రాంబాబు ఆధ్వర్యంలో ఎస్సైలు అంజయ్య, రామన్‌కుమార్, సిబ్బంది చర్యలు తీసుకున్నారు.